క్లుప్తంగా

అలరించిన వీణా కచేరీ



వీణా కచేరీ చేస్తున్న విద్యార్థినులు

సీటీఆర్ఐ: విజయ శంకర నృత్య, సంగీత ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వీణా కచేరీ అలరించింది. నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జీఎల్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థి మణికంఠ సాయి నరేష్ మృదంగం వాయించారు. అనంతరం కేఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వి.శ్రీదేవి, కె.సత్యశివగౌరి వీణా కచేరీ నిర్వహించారు. ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక కళాకారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కడియం: కడియం – వీరవరం రోడ్డులో కొలువైన కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భారీ ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఉదయం నుంచే ఆలయం వద్ద రద్దీ ఏర్పడింది. ఆలయ పరిసరాల్లోనే కుటుంబ సమేతంగా వంటలు వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

22న గోదాదేవికి సారె సమర్పణ

కడియం: ధనుర్మాస ప్రత్యేక పూజల్లో భాగంగా దుళ్లలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి ఈ నెల 22న పసుపు, కుంకుమ, సారె సమర్పిస్తున్నట్టు అర్చకులు లక్ష్మణాచార్యులు, ఆలయ భక్తులు తెలిపారు. గోదాదేవి జన్మ నక్షత్రమైన పుబ్బ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరుపుతున్నామన్నారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. భక్తులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్య నగర్‌లోని లెప్రసీ కాలనీలో శుక్రవారం ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ సుమియన్ మాట్లాడుతూ అందరిపై దేవుని ప్రేమ కురిపించాలని ప్రార్థించారు. వంశీ వెల్నెస్ హాస్పిటల్స్ వైద్యుడు వంశీ ముఖ్య అతిథిగా హాజరైన అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాశి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆనంద్ పాల్, డేవిడ్‌రాజు, మణి, పెట్ల కుమార్, అనూష పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి కృషి



వేమగిరిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

కడియం: నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన శుక్రవారం పలువురు అధికారులతో కలిసి కడియం మండలం వేమగిరిలోని టూరిజం అభివృద్ధికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా మౌలిక వసతులు పెంచడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ఆర్థికంగా వృద్ధి చేయడమే లక్ష్యంగా పర్యాటక కార్యక్రమాల ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ కె.పోసిబాబు, జిల్లా ఉద్యానాధికారి దుర్గేష్, నీటిపారుదల శాఖ ఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.

ముంపునకు బై.. రోగాలకు సై..

- డ్రైనేజీలో తాగునీటి పైపులైన్
- లీకేజీ ఏర్పడితే నీరు కలుషితం
- వ్యాధులు ప్రబలే అవకాశం
- కార్పొరేషన్ అధికారుల తీరుపై ప్రజల విమర్శలు

రాజమహేంద్రవరం సిటీ: కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల పనితీరు మారింది. ఒక సమస్యను పరిష్కరించడానికి చేపట్టే పనులతో ఇంకా పెద్ద సమస్య ఏర్పడే అవకాశం ఉంది. నగరంలో ముంపు సమస్యను పరిష్కరించేందుకు చేపడుతున్న డ్రైనేజీ ఇందుకు నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. చినుకు పడితే చాలు నగరంలోని కృష్ణానగర్, ఆదెమ్మ దిబ్బ, రామచంద్రరావుపేట తదితర ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. ఆ సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని పరిష్కారం కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆరు అడుగుల లోతు, ఆరు అడుగుల వెడల్పుతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. అయితే ప్రజలకు రక్షిత నీటిని అందించే పైపులైన్‌ను ఆ డ్రైనేజీ మధ్యలోనే ఉంచి నిర్మాణం కొనసాగించడంపై విమర్శలు వస్తున్నాయి. భవిష్యత్తులో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడితే డ్రైనేజీ నీరంతా లోపలకు వెళ్లిపోయే ప్రమాదం ఉంది. కుళాయిల ద్వారా ఆ కలుషిత నీరే రావడంతో రోగాలు ప్రబలుతాయి.

లీకులు ఏర్పడితే ప్రమాదమే

సీతంపేట వాటర్ ట్యాంక్ నుంచి చుట్టుపక్కల ప్రాంతాలైన కృష్ణానగర్, రామచంద్రరావుపేట, లలితా నగర్ (పార్ట్), ఆర్యాపురం (పార్టు), రామచంద్రరావుపేట, కోర్లమ్మ పేట, తుమ్మలావ, దేవీచౌక్, కోటిలింగాలపేట, ఈఎస్ఐ హాస్పిటల్,



డ్రైనేజీ లోపల పైపులైన్‌ను ఉంచి పనులు చేస్తున్న సిబ్బంది



చురుగ్గా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

సీతంపేట, స్వతంత్ర హాస్పిటల్ తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. ఈ నీటి సరఫరా పథకం ప్రధాన పైపులైన్‌ను డ్రైనేజీ మధ్యలో పెట్టి నిర్మాణం సాగిస్తున్నారు. దీనివల్ల రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

ముంపు సమస్య పరిష్కారానికి..

నగరంలోని కృష్ణా నగర్ తదితర ప్రాంతాల్లో ముంపు సమస్యను తప్పించేందుకు నగరపాలక సంస్థ అధికారులు ఈ కాలువ నిర్మాణం చేపట్టారు. ఇది కృష్ణానగర్, ఆదెమ్మ దిబ్బ మీదుగా ఆర్యాపురం సమీపంలోని ఎస్‌టీ ప్లాంట్‌కు కలుస్తుంది. ఈ కాలువ నిర్మాణం చేపట్టడం అభినందనీయమే. అయినప్పటికీ తాగునీటి పైపులైన్ లీకేజీ ఏర్పడి, దానిలోకి డ్రైనేజీ నీరు చేరే అవకాశం ఉంది. దురదృష్టవశాత్తూ అదే జరిగితే చాలా ప్రమాదం జరుగుతుంది. పైపులైన్ ద్వారా సరఫరా అయిన నీరు తాగిన వారందరూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఈ విషయంపై నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ పాండురంగారావును సాక్షి వివరణ కోరగా.. కాలువ నిర్మాణం పూర్తయిన తరువాత మంచినీటి పైప్‌లైన్ ఎత్తు పెంచుతామన్నారు. దాన్ని కాలువ పైభాగం నుంచి వెళ్లేలా ఏర్పాటు చేస్తామన్నారు.

పునరాలోచన చేయాలి



తాగునీటి పైపులైన్‌ను డ్రైనేజీ మధ్యలో ఉంచి నిర్మాణ పనులు చేపట్టడం సరికాదు. పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడితే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు పునరాలోచన చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కమిషనర్, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.

– జి.కృష్ణ

సరికాదు



డ్రైనేజీలో పైపులైన్ ఉంచడం సరికాదు. దీనివల్ల రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ పైపులైన్ నుంచి సరఫరా అయిన నీటిని చాలామంది వినియోగిస్తారు. ఏమాత్రం లీకేజీలు ఏర్పడినా డ్రైనేజీ నీరంతా పైపులైన్‌లోకి చేరుతుంది. అధికారులు స్పందించాలి.

– గరగ వేణు

'గౌతమి'లో అవినీతి జరిగితే నిరూపించాలి

- టీడీపీ నాయకుల వ్యాఖ్యలు అనైతికం
- మాజీ ఎంపీ భరత్‌రామ్ హయాంలో నగర అభివృద్ధి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: గౌతమి సూపర్ బజార్ వ్యవహారంలో అవినీతి జరిగితే నిరూపించాలని అధికార పార్టీ నాయకులకు వైఎస్సార్ సీపీ నాయకులు బిల్డర్ చిన్న, గేడి అన్నపూర్ణ రాజు సవాల్ విసిరారు. స్థానిక ప్రెస్‌క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూపర్ బజార్ విషయంలో రూ.5 కోట్ల అవినీతి జరిగితే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారని, రోడ్లు, పార్కుల అభివృద్ధితో పాటు మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కూటమి ప్రభుత్వం ఆపివేసి, రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కిందన్నారు. మద్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధరలు తగ్గించామని టీడీపీ నాయకులు చెబుతున్నారని, అయితే నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దళిత యువకుడు పులి సాగర్ మాట్లాడుతూ ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ తనను అర్ధనగ్నంగా కూర్చోబెట్టడం వెనక ఎమ్మెల్యే హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఆ సంఘటన జరిగిన రోజు పోలీసు స్టేషన్‌లో సీసీ టీవీ పుటేజ్‌ను బయటపెట్టాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు గారా చంటిబాబు, నందం స్వామి, మునీశ్వర్, కొమ్మోజు దుర్గారావు, గౌరీ శంకర్, బూరా కనక లింగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు మనందరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించడం మనందరి బాధ్యత అని ఆ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ అన్నారు. జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ఇంధన పొదుపు ఆవశ్యకతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. చివరి రోజు విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమాన్ని ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ కుమార్ మాట్లాడుతూ అందరూ ఫైవ్‌స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వినియోగించాలన్నారు. అవసరం లేనప్పుడు ఇంట్లో ఫ్యాన్, లైట్లను ఆఫ్ చేయాలన్నారు. పగటిపూట ఇంటిలోకి సూర్యకాంతి వచ్చేలా చూసుకోవాలని, దీని వల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) వీవీ కిశోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చిన్న మాల్యాద్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనంలో సిరి చందనకు ప్రథమ బహుమతి అందిస్తున్న ఎస్ఈ తిలక్ కుమార్, ఈఈ శామ్యూల్

అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి అన్నారు. తొర్రేడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి, తహసీల్దార్ జయసూర్యకుమార్‌లు ఐదు అర్జీలను స్వీకరించారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారుల సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలను పరిశీలించడానికి ఫీల్డు విజిట్‌కు వెళుతున్న అధికారులు

పుత్ర హనోక్‌కు గుడ్ సమరిటన్ అవార్డు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక బర్మా కాలనీకి చెందిన జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్‌కు గుడ్ సమరిటన్ 2024 నేషనల్ అవార్డు లభించింది. కెన్యాకు చెందిన గుడ్ న్యూస్ మిషన్ ప్రతినిధి ప్రొఫెసర్ యోహాన్ కిమ్ చేతుల మీదుగా ఆయన జ్ఞాపిక, పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. స్థానిక హోటల్ షెల్టన్‌లో గ్లోబల్ పీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ సమరిటన్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యోహాన్ కిమ్ మాట్లాడుతూ జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ ద్వారా పుత్ర హనోక్ మూడు దశాబ్దాలుగా పేదల సంక్షేమం కోసం అనేక సేవలు అందిస్తున్నారన్నారు. ఆ సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పి.జాకబ్ సుందర్, సెరిల్ రిచర్డ్, ఐ.కిషోర్ కుమార్, అద్దంకి రాజయోనా, ఎం.రమేష్, ఎం.విశాల్ ప్రేమ్ పాల్గొన్నారు.



పుత్రహనోక్‌కు అవార్డు అందజేస్తున్న ప్రొఫెసర్ యోహాన్ కిమ్

కేంద్ర మంత్రి అమిత్‌షా చిత్రపటం దహనం



పొట్టిలంకలో నిరసన తెలుపుతున్న నాయకులు

కడియం: రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు శుక్రవారం పొట్టిలంకలో నిరసన తెలిపారు. ఆ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యువజన సంఘం, జైభీమ్‌యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేశారు. తక్షణం ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నక్కా వెంకటరత్నరాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అంతం చేయాలని చూస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను అంతమొందించేందుకు అందరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో కోణాల లాజర్, నక్కా చంటిబాబు, కప్పల భాస్కర్, జల్లి రాజు, అంబటి రాజారత్నం, రాయుడు ప్రసాద్, నక్కా రత్నరాజు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



గురుకులం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యాంసుందర్ అన్నారు. రాజమహేంద్రవరంలో సత్యసాయి గురుకులంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రేమ, దయ, కరుణతో మానవులు మెలగాలని ఏసుక్రీస్తు బోధించారన్నారు. భగవాన్ సత్యసాయిబాబా అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు అన్న సందేశాన్ని ఇచ్చారన్నారు. ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ అన్ని మతాల భావన ఒక్కటేనని చాటిచెప్పేలా తమ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయురాలు రూనీస్.. క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలువ సాక్షి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో..

బొమ్మూరులోని శిలువ సాక్షి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ గురజ సుకుమార్ అతిథులను ఆహ్వానించారు. అంతర్జాతీయ సువార్త గాయకులు నిస్సీ జాన్ ఆత్మీయ గీతాలు ఆలపించారు. సిస్టర్ కాంతి కళ దైవ సందేశం అందించారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి.



శిలువ సాక్షి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వేడుకలు

26 నుంచి దస్తావేజుల పరిశీలన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని భాస్కర్ నగర్ ప్రాంతం నివాసితుల దస్తావేజులు, లింక్ దస్తావేజులను ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు ప్లాట్ల వద్దనే పరిశీలిస్తామని జిల్లా సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆ ఏరియాలోని ది రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి చెందిన ప్లాట్ల యజమానులందరూ 1970 నుంచి ఇప్పటి వరకూ గల ఒరిజినల్ దస్తావేజులను, ఇంటి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లుల రశీదులను సిద్ధం చేసుకోవాలన్నారు.

వరి, మొక్కజొన్నకు బీమా సౌకర్యం

రాజమహేంద్రవరం రూరల్: రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న పంటలకు బీమా సౌకర్యం కల్పించారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.మాధవరావు తెలిపారు. వీటి ప్రీమియంగా వరికి రూ.630, మొక్కజొన్నకు రూ.540ను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని రైతులకు సూచించారు.

కార్యకర్తలకు అండగా..

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కొంతమూరులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం గ్రామ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 50 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి తదితరులు

సీటీఆర్ఐ: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి జేవీఎస్ఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలను అందరూ తెలుసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కొనే వస్తువులతో వినియోగదారుడికి నష్టం వాటిల్లితే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు, డీపీసీసీ సభ్యులు సుంకర వీర శేఖర్, గొట్టిముక్కల ఆనంతరావు, వైస్ ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌కు ఆ హక్కు లేదు

రాజమహేంద్రవరం సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాటలను కాంగ్రెస్ వక్రీకరించిందన్నారు. అంబేడ్కర్‌కు సంబంధించిన ఐదు ప్రదేశాలను పంచ తీర్థ పేరుతో బీజేపీ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేసిందన్నారు.

ఉద్యోగులకు పదవులపై హర్షం

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘంలో రాజమండ్రి సబ్ డివిజన్‌కు చెందిన కోశాధికారిగా ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లా సంఘం ఎన్నికల్లో వీరిని ఎంపిక చేసినట్టు రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి సీజేపీ పీటర్ ప్రభుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.

సినిమాలు



శ్యామల	: విడుదల–2
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: బచ్చలమల్లి
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: ముఫాసా
మేనక	: లక్కీభాస్కర్
రంభ	: మిస్‌యూ
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప–2
అశోక	: బచ్చలమల్లి
నామవరం	
వీఎస్ మహల్	: పుష్ప–2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప–2, మార్నింగ్ షో విడుదల
కడియం	
వెంకటసూర్య	: ముఫాసా, పుష్ప–2